రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

వాహనాల తనిఖీలో పట్టుబడ్డ రూ. 2లక్షలు సీజ్

కొత్తూర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :

వాహన తనిఖీలో పట్టుబడ్డ రూ.2లక్షలు ఎన్నికల కోడ్ ఉన్నందున వాహనాల తనిఖీలో భాగంగా కొత్తూర్ ఇన్స్పెక్టర్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తనిఖీలో శనివారం రూ.2లక్షలు పట్టుపడ్డాయని ఇన్స్పెక్టర్ శంకర్‌రెడ్డి తెలిపారు. కొత్తూర్ నుండి జేపీ దర్గా వెళ్లే రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అదే సమయంలో అటు నుండి వెళ్తున్న కుమ్మరిగూడ గ్రామానికి చెందిన కుమ్మరి భిక్షపతి దగ్గర ఉన్న బ్యాగును తనిఖీ చేయగా అతని బ్యాగులో రూ.2లక్షలు దొరికాయన్నారు. రూ.2లక్షలను స్వాధీనపర్చుకుని ఎన్నికల మోనిటేరింగ్ సెల్‌కు తదుపరి చర్య నిమిత్తం పంపడం జరిగిందన్నారు.

పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

-జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్,అక్టోబర్ 21, ప్రభాతవార్త:

పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి సేవలను గుర్తుంచుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా శనివారం స్థానిక జిల్లా ఎస్పీ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏ దేశంలో నైనా శాంతి భద్రతల పరిరక్షణ బాగుంటేనే దేశం అభివృద్ధి తో పాటు, సంక్షేమ ఫలాలు అందరికీ అందుతాయని అన్నారు. ప్రస్తుత తరుణంలో పలు దేశాలలో శాంతిభద్రతల సమ స్యలు తలెత్తుతుంటాయని, మనదేశంలో శాంతిభద్రతలను కాపాడు కుంటూ అభివృద్ధి పథంలో దూసుకు వెళ్తున్నామన్నారు. ఇందుకు దేశంలో పోలీసుల పాత్ర బలియమైన శక్తి అని అన్నారు. పోలీసు వ్యవస్థ ప్రజల ప్రశాంతత కోసం, తమ ప్రశాంతను కోల్పోయి కూడా సేవలందిస్తున్నందుకు గర్వించాలన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజల సంరక్షణ కోసం ఇటీవల కాలంలో 189 మంది పోలీసులు వారి ప్రాణాలను కోల్పోవడం జరిగిందన్నారు. వారి ప్రాణ త్యాగాలను గుర్తు చేసుకోవడం ఎంతైనా అవసరం ఉందన్నారు. పోలీసు యూనిఫామ్ కు ప్రత్యేక గౌరవం ఉందని, దేశ రాష్ట్ర ప్రజలు గుర్తుంచుకునే విధంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖ జిల్లాలోని గ్రామీణ స్థాయి నుంచి మండల స్థాయి వరకు మంచి సేవలు అందిస్తూ శాంతి భద్రతలను పరిరక్షించడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం జరగబోవు శాసనసభ ఎన్నికలలో మంచి సేవలను అందించాలని తెలిపారు. విధినిర్వహణ తోపాటు ప్రతి ఒక్క రూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి మాట్లాడుతూ, 1959 అక్టోబర్ 21న ఇండియా చైనాకు మధ్య సియాచిన్ అనే ప్రాంతాన్ని అక్రమంగా ఆక్రమించు కునే దశలో జరిగిన పోరాటంలో పంజాబ్ పోలీసులు విరోచితంగా పోరాడి 21 మంది పోలీసులు ప్రాణాలను కోల్పోయారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరుల దినోత్సవం పది రోజుల పాటు నిర్వహించుకోవడం జరుగు తుందన్నారు. ఇప్పటికి ఎంతో మంది పోలీసులు విధి నిర్వహణలో వారి ప్రాణాలను త్యాగం చేస్తుంటారని, పోలీసు ఉన్నతాధికారుల నుంచి చిన్న స్థాయి అధికారులకు నక్సల్ ప్రభావిత ప్రాంతాలలో ప్రాణ త్యాగాలు చేసిన వారిని స్మరించుకోవలసిన అవసరం ఉందన్నారు. గతంలో వికారాబాద్‌లో మావోయిస్టులు సంచరించే వారని, వారిని తరిమికొట్టి ప్రశాంత వాతావరణం నెలకొల్పడం జరిగింద న్నారు. విధి నిర్వహణలో చనిపోయిన వారిని స్మరించుకోవడం వల్ల ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వారందరికీ స్ఫూర్తిని కలగ జేసేందుకు సంస్మరణ దినం నిర్వహించుకోవడం జరుగుతుంద న్నారు. పోలీసులు ఆత్మస్థైర్యంతో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల మాన ప్రాణ ధనాలకు రక్షణ కల్పిస్తూ పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా అమరుల స్తూపం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తూ నివా ళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు ముర ళీధర్, రవీందర్ రెడ్డి, డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బం ది తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళ్ళు అర్పిస్తున్న జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి

కట్టమైసమ్మ ఆలయంలో హోమపూజలు

కట్టమైసమ్మ ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఆమనగల్లు, అక్టోబర్21, ప్రభాతవార్త:

ఆమనగల్లు పట్టణంలోని సురసముద్రం చెరువు కట్ట మైసమ్మ ఆలయంలో దేవినవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల 9వరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మొక్తాల వెంకటయ్య సారథ్యంలో దేవి నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. శనివారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారికి ప్రత్యేక హోమం పూజలు చేశారు. బీఆర్ఎస్ రైతు సంఘం జిల్లా నాయకులు రూపం వెంకట్‌రెడ్డి దంపతులు హోమంలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలకు చుట్టు ప్రక్కల ప్రాంతాల భక్తులతో పాటు ఇతర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. కార్యక్రమంలో సిద్దూ, మల్లేశ్, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి బోనాల పండుగ

ఘట్‌కేసర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:

ఘట్‌కేసర్‌లో శనివారం పెద్దమ్మతల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలోని పెద్దకంచెలో వెలిసిన శ్రీశ్రీశ్రీ పెద్దమ్మతల్లికి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ జరిపారు. ఈసందర్భంగా పసుపు, కుంకుమ, వేపకులతో బోనాలను తయారు చేసి డప్పుశబ్దాల మధ్య ఊరేగింపుగా తీసుకువెళ్లి పెద్దమ్మ అమ్మవారికి నైవేధ్యం సమర్పించారు. ఈకార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బర్ల కిష్టయ్య, మాజీ అధ్యక్షులు బర్ల రాధాకృష్ణ, కార్యదర్శి రెడ్డబోయిన శ్రీశైలం, ఉపాధ్యక్షులు నగ్రా పోచయ్య, మెడబోయిన శంకర్ (బబ్బా), సంయుక్త కార్యదర్శులు మన్నె ఐలయ్య, కోట్ట రాజు, సంఘం సభ్యులు సార నర్సింగ్‌రావు, బర్ల వెంకటేశ్, బర్ల రాజలింగం, దర్శన్, ఎం.అరుణ్, అజయ్, నాని, బి.శివ, మహిళలు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ పెద్దకంచెలో పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పిస్తున్న ముదిరాజ్ కులస్థులు

బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాలో..

- వాడ వాడలో బతుకమ్మ సంబురాలు

బతుకమ్మలతో మహిళలు, చిన్నారులు

తాండూరు, అక్టోబరు 21, ప్రభాతవార్త :

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ సంబురాలు తాండూరులో వైభవంగా కొనసాగుతున్నాయి. బతుకమ్మ... బతుకమ్మ.. ఉయ్యాలో అంటూ మహిళలు, యువతులు, చిన్నారులు వాడ వాడల బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని హేరూర్ వార్డు, గాంధీనగర్, ఇందిరానగర్, సాయిపూర్, మల్‌రెడ్డిపల్లి, పాతతాండూరు తదితర వార్డులలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఆయా వార్డు కమిటిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబురాల్లో పెద్ద ఎత్తున మహిళలు, యువతులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొని బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. రకరకాల పూలతో చేసిన బతుకమ్మలను తీసుకువచ్చి సంబరంగా బతుకమ్మ ఆట ఆడుతూ పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

బీఆర్ఎస్ పార్టీ మెనిఫెస్టో అంతా కాఫీ పెస్టులే

- షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి
- చెప్పేది ఒక్కటి... చేసేది ఒక్కటి
- బీఆర్ఎస్ హామీలను ఎవరు నమ్మొద్దు : వీర్లపల్లి శంకర్.

షాద్‌నగర్, అక్టోంబర్ 21, (ప్రభాతవార్త) :

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు చెప్పేది ఒక్కటి అయితే... చేసేది మరొక్కటి... ఆ పార్టీ తీసుకొచ్చిన మెనిఫెస్టో కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోను కాఫీ పెస్టు చేసిందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అన్నారు. గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీ తీరుతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని, ఇక వారి మోసాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని ప్రతాప్‌రెడ్డి పార్టీ కార్యాయలంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రధాన కారణం మన ఉద్యోగాలు, నీరు, నిధులు కావాలనే సంకల్పంతో ఏర్పాడిందని, అందుకు కాంగ్రెస్ పార్టీ సహకరించి తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. కానీ సాధించుకున్న తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలను సరిగ్గా నేరవేర్చాలేకపోయారని, ప్రజలను మోసం చేసి ప్రభుత్వాన్ని నడుపుతున్నాడని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పేది ఒకటి చేసేది ఒకటి అని ఆయన మండిపడ్డారు. ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా విఫలమైందని, అందుకే ఆ పార్టీని వీడి మళ్లీ కాంగ్రెస్ పార్టీకి రావడం జరిగిందని ఆయన అన్నారు. రాష్ట్రంలో నీళ్లు, నిధులు పుష్కలంగా ఉన్నాయని, ఇవన్నీ సొంత ప్రయోజనాలకు తప్ప ప్రజలకు వెచ్చించింది ఏమీ లేదని ఆయన ఎద్దేవా చేశారు. దళిత బంధు ఎంత మందికి ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. అదేవిధంగా డబుల్ బెడ్‌రూం ఇండ్లను,, దళితులకు, గిరిజనులకు మూడెకరాల భూమి, యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని ఆయన బీఆర్ఎస్ పార్టీపై ప్రశ్నల వర్షం కురిపించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించడం ఖాయమని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థలను సహితం ఘోరంగా మోసం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, ఏ గ్రామానికి వెళ్లిన బీఆర్ఎస్ ఆగడాలను ఎండగడుతున్నారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియమ్మ రుణాన్ని తీర్చుకునే సమయం ఆసన్నమైందని, టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని ఆయన అన్నారు. నియోజకవర్గంలో సహితం కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని, పుర్వవైభవం రాబోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా పెద్ద మొత్తంలో కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్న నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో టీపీసీసీ సభ్యుడు బాబరఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్యాయాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, కార్మిక నాయకుడు రఘు, సీనియర్ నాయకుడు చెంది తిరుపతిరెడ్డి, ఫరూఖ్‌నగర్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, యూత్ రాష్ట్ర నాయకుడు అందెమోహన్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

ఘట్‌కేసర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

ఘట్‌కేసర్ గురుకుల్‌లో సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

బతుకమ్మలను కొలనులో నిమజ్జనం చేస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలో సద్దుల బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఇక్కడ 7వ రోజునే సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకోవడం అనవాయితీగా వస్తోంది. గురుకుల్ మైదానంలో జనచైతన్యసేవాసమితి, స్వామి వివేకానంద యూత్, యువజనసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్-జనచైతన్యసేవాసమితి వ్యవస్థాపకులు అబ్బుసాని యాదగిరియాదవ్ నేతృత్వంలో బతుకమ్మ సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్, సీఎంఆర్ హెల్త్‌సిటి డైరక్టర్ ప్రీతిరెడ్డిలు ముఖ్యఅతిథిగా విచ్చేసి బతుకమ్మ ఉత్సవాలను ప్రారంభించారు. శ్రీభవాని నవరా త్రి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో అమ్మవారిని వారు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఘట్‌కేసర్ ఉమ్మడి మండలంలో ఘట్‌కేసర్ పట్టణంలోనే మొదటగా ఏడురోజులు నిర్వహించి బతుకమ్మ వేడుకలను ముగిస్తారు. పట్టణంలోని వివిధ కాలనీల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు బతుకమ్మలను తీసుకువచ్చి పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. మైదానంలో మైమాస్ట్‌లైట్లు, డీజే శబ్దాల మధ్య బతుకమ్మ, దాండియా, కోలాటం, పాట, ఆటలతో సంబరాలు ఘనంగా జరిగాయి. మంత్రి కోడలు ప్రీతిరెడ్డి మహిళలతో బతుకమ్మ నృత్యాలు చేస్తూ ఉత్సాహ పరిచారు. ప్రజలు బతుకమ్మ వేడుకలను తిలకించడానికి భారీ తెరను ఏర్పాటు చేశారు. అనంతరం బతుకమ్మలను తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కొలనులో నిమజ్జనం చేశారు. ప్రతియేటా గురుకుల్‌లో సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు యాదగిరి యాదవ్ తెలిపారు. పలువురు కౌన్సిలర్లు, స్వామి వివేకానంద, జనచైతన్యసేవాసమితి, యువజన సంఘాల సభ్యులు, నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులను నిర్వహకులు శాలువాలతో సన్మానించారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, మేడ్చల్ బిఖ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, బోడుప్పల్ కార్పొరేటర్ అజయ్‌యాదవ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యాలుయాదవ్, కౌన్సిలర్లు, నాయకులు, యూత్‌ల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈవిఎంల తరలింపునకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఈవిఎంలను ఐదు నియోజకవర్గాలకు తరలింపునకు ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమ్, పాల్గొన్న అదనపు కలెక్టర్‌లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 21, ప్రభాతవార్త

జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవిఎంల తరలింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా ఈవిఎంల గోడౌన్ నుంచి ఐదు నియోజకవర్గాల కొరకు ఏర్పాటు చేసిన కేంద్రాలకు కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వివి ప్యాట్ల తరలింపునకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసుకుని, శనివారం ఉదయం వారి సమక్షంలోనే ఈవిఎంలను గోడౌన్ తెరిచి ర్యాండమైజేషన్ ప్రకారం ఓటింగ్ యంత్రాలను సిద్ధం చేసుకోవటం జరిగిందని,ఆ తరువాత మేడ్చల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాల వారీగ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు తరలించి భద్రపర్చటం జరుగుతుందన్నారు. ఆ తరువాత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అబ్జర్వర్‌ల పర్యవేక్షణలో రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద 12 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:

చర్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద ఓ వ్యక్తి నుండి 12 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సంఘటన వివరాలు ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ సీఐ మల్లయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ముందస్తు విశ్వసనీయ సమాచారం మేరకు ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులతో పాటు మల్కాజ్‌గిరి ఎస్‌టీఎఫ్ పోలీసులు చర్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద కాపుకాయగా రైల్వేస్టేషన్ నుండి ఓ వ్యక్తి రెండు బ్యాగులతో బయటకు వచ్చాడు. దీంతో పోలీసులు సదరు వ్యక్తివద్ద బ్యాగు తనిఖీ చేయగా అందులో దాదాపు 12 కిలోల ఎండు గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పట్టుబడిన వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా ఒడిశా నుండి ఇక్కడకు తెచ్చి గంజాయి సేవించే వ్యక్తులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తి పేరు రోషన్ మహాకుడ్ కుమార్ (23)గా పోలీసులు తెలిపారు. ఎండు గంజాయితో పాటు నిందితుడి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఘట్‌కేసర్ సీఐ మల్లయ్య తెలిపారు.

ఒడిశాకు చెందిన వ్యక్తి నుండి 12 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు.

అక్రమ మద్యం రవాణాపై గట్టి నిఘా .!

- రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ కమిషనర్ డేవిడ్ రవికాంత్

తాండూరు, అక్టోబరు 21, ప్రభాతవార్త :

అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సరిహద్దు ప్రాంతాలలో అక్రమ మద్యం రవాణా కాకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ కమిషనర్ డేవిడ్ రవికాంత్ తెలిపారు. శనివారం తాండూరులోని దుర్గాగ్రాండ్యూర్ హోటల్‌లో కర్ణాటక- తెలంగాణ ఇంటర్ స్టేట్ బోర్డర్ జిల్లాల పోలీస్, ఎక్సైజ్ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సరిహద్దు కర్ణాటక రాష్ట్రం నుండి అక్రమంగా మద్యం, గుడుంబ తదితర మత్తు పదార్థాల రవాణాపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. సరిహద్దు కర్ణాటక రాష్ట్రం నుండి అక్రమంగా మద్యం రవాణాపై నిఘా పెంచడం జరుగుతుందని తెలిపారు. రెండు రాష్ట్రాల అధికారులు కలిసికట్టుగా సమన్వయంతో పని చేయడం జరుగుతుందని చెప్పారు. అదేవిదంగా గతంలో వివిద కేసులలో నిందితులుగా ఉండి కర్ణాటకలో తలదాచుకున్న వారి వివరాలపై ఆరా తీశారు. మద్యం అక్రమ రవాణా జరిగే ఆరు రూట్లను గుర్తించి చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిఘా పెంచడం జరుగుతుందని వివరించారు. మిర్యాన్- కోత్లాపూర్, చత్రాసాలా- కరణ్‌కోట్, బొందంపల్లి - నీలపల్లి, అడికి - మైల్వార్, అల్కోడ్, పోతుగంటి, షాదీపూర్- ఓమ్లానాయక్ తాండా రూట్లలో నిఘాను పటిష్టం చేయనున్నట్లు తెలిపారు. సరిహద్దు ప్రాంతాల నుండి ఎటువంటి అక్రమ రవాణా జరిగినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ కమిషనర్ డేవిడ్ రవికాంత్, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్ర, తాండూరు డిఎస్పీ శేఖర్‌గౌడ్, సీఐలు అనంతయ్య, సైదులు, ధన్వంత్‌రెడ్డి, సమాదేవుడు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎక్సైజ్, పోలీసు శాఖ అధికారులు

ఇంద్రసేనారెడ్డిని సన్మానించిన బిజెపి నాయకులు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 21, ప్రభాతవార్త

త్రిపుర గవర్నర్‌గా నియమితులైన బిజెపి అగ్రనేత మాజీ ఎమ్మెల్యే నల్లు ఇంద్రసేనారెడ్డిని మర్యాదపూర్వకంగ మేడ్చల్ జిల్లా బిజెపి రూరల్ అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమలరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ ఎ.మోహన్‌రెడ్డి, కీసర మండల అధ్యక్షులు దేశం మల్లేశ్‌గౌడ్‌లు సన్మానించి అభినందించారు. శనివారం ఆయన నివాసంకు బిజెపి నాయకులు వెళ్లి సన్మానించి అభినందనలు తెలియజేశారు. బిజెపి సీనియర్ నాయకునిగా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే నల్లు ఇంద్రసేనారెడ్డి త్రిపుర గవర్నర్‌గా నియమితులు కావటం సంతోషంగ ఉందని జిల్లా బిజెపి అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయనతో పాటు తిరుమలరెడ్డి, ఎ.మోహన్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే నల్లు ఇంద్రసేనారెడ్డిని కలిసి సన్మానించిన జిల్లా బిజెపి అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి, పాల్గొన్న తిరుమలరెడ్డి, ఎ.మోహన్‌రెడ్డి,మల్లేశ్‌గౌడ్ , తదితరులు

కదం తొక్కిన కాంగ్రెస్

-మాడ్గులలో కాంగ్రెస్ జోష్
-కసిరెడ్డికే తమ మద్దతంటున్న మాడ్గుల ప్రజానీకం

అంబేద్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రజలకు అభివాదం చేస్తున్న నాయకులు

మాడ్గుల, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే కేవలం బీఆర్ఎస్ పార్టీ నాయకులే బాగుపడుతారని, కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే సకలజనులు బాగుపడుతారని కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి నుంచి ఇప్పటికే మూడుసార్లు గెలుపొందిన అసమర్థ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను ఇంటికి సాగనంపాలని ఆయన పిలుపునిచ్చారు. మాడ్గుల మండల కేంద్రంలోని వైకేఎస్ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశానికి సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్వకుర్తిలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, ఎన్ని మోసాలు చేసిన సీఎం కేసీఆర్‌ను గద్దె దింపేందుకు కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. జిల్లాలో ఎమ్మెల్సీగా ఉన్న తాను పూర్తి స్థాయిలో ప్రజలు, కార్యకర్తలకు సేవ చేయలేకపోయానని, అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరానని స్పష్టం చేశారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌లో మన ప్రాంతానికి తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని, గతంలో 2018 కంటే ముందు ఉన్న అభివృద్ధి పనులే ఉన్నాయని, ప్రతి గ్రామంలో రూ.50లక్షలతో సీసీ రోడ్లు మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. అధిష్టానం నుంచి ఎమ్మెల్యే ఎలాంటి అభివృద్ధి పనులు తేవడం లేదని, 5 సంవత్సరాల పనులు కాలయాపనకే సరిపోయిందని కసిరెడ్డి విమర్శించారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు గతంలో 50 కిలో మీటర్ల వరకు తాను వేగవంతంగా పనులు పూర్తి చేయించానని, మిగిలిపోయిన అరకిలో మీటర్ పనులు ఇప్పటి వరకు పూర్తి చేయడం లేదని ఆయన విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసానికి గురి చేసిందని, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని కల్వకుర్తిలో గెలిపించుకోవాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీకి అధికారంలోకి రాగానే గ్యాస్ సిలిండర్ రూ.500లకు అందజేస్తామన్నారు. ప్రతి ఇంటికి గృహజ్యోతి క్రింద 200 యూనిట్లు ఉచితంగా కరెంట్, ఇల్లు లేని వారికి ఇంటి స్థలం ఉంటే రూ.5లక్షలు, రైతు భరోసా క్రింద ప్రతి సంవత్సరం కౌలు రైతుకు రూ.5వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, యువ వికాసం క్రింద విద్యార్థులకు రూ.5లక్షలు, విద్య భరోసా కార్డు ఇస్తుందన్నారు. అంతే కాకుండా చేయూత క్రింద రూ.4వేల ఫించన్, రూ.10లక్షల ఆరోగ్య శ్రీ భీమా అందజేస్తుందన్నారు. ప్రజలకు చేరవయ్యే విధంగా కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో పథకాలను చేకూర్చిందన్నారు. అనంతరం పలువురు నాయకులు పార్టీలో చేరారు. అంతకు ముందు మాడ్గుల మండలంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మాడ్గుల మండలంలో నిర్వహించిన సభ సక్సెస్ కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో మరింత జోష్ పెరిగింది. మాడ్గుల మండల ప్రజానీకం మీ వెంటే మేమంటూ



ప్రచార కార్యక్రమంలో భాగంగా మహిళలతో కలిసి నడుస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

ముందుకు నడుస్తున్నారు. గ్రామంలోని అంబేద్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి పార్టీ అభ్యర్థి గెలుపుకు శ్రమిస్తున్న తీరు అందరికి ఆదర్శంగా నిలుస్తుంది. మాజీ ఎమ్మెల్యే వంశీబాటలోనే ఆయన అనుచర వర్గం సైతం కసిరెడ్డి గెలుపుకు నిరంతరంగా కష్టపడి పనిచేసి గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. 9 సంవత్సరాల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వంతో అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నామని, మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ప్రజలందరు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని, ప్రజల్లో సైతం చైతన్యం వచ్చి రాష్ట్రంలో అధిష్టాన మార్పుకు అడుగులు వేస్తున్నారు. కసిరెడ్డి సభ విజయవంతం కావడంతో అధికార పార్టీ నాయకులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. కార్యక్రమంలో మాడ్గుల మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రచారంలో జోరు పెంచుతున్న బీఆర్ఎస్

అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అంజయ్యయాదవ్, తదితరులు.

షాద్‌నగర్, అక్టోంబర్ 21, (ప్రభాతవార్త) :

అధికార పార్టీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో జోరు పెంచింది. శనివారం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కేశంపేట మండల పరిధిలోని సంతాపూర్ తదితర గ్రామాల్లో ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఆయనతో పాటు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి అంజయ్యయాదవ్ ఆయా గ్రామాల్లో గడపగడపకు బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని వివస్తూ రాబోయే రోజుల్లో చేసే అభివృద్ధిని సహితం ప్రజలకు వివరిస్తున్నారు. గత 10 సంవత్సరాల్లో గ్రామాల్లో చేసిన అభివృద్ధిని ప్రజలకు ఒక్కొక్కటిగా వివరించారు. కారు గుర్తుకు ఓటేయాలని ప్రజలకు అండగా ఉంటుందని ఆయన ప్రజలకు భరోసా కల్పించారు. మీ సేవకుడిగా మరోసారి మీ ముందుకు వచ్చానని ఆశీర్వాదిస్తే ఎంతో అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. ప్రచారంలో భాగంగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బిజెపి నాయకులు

పార్టీలో చేరుతున్న వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే.

షాద్‌నగర్, అక్టోంబర్ 21, (ప్రభాతవార్త) : షాద్‌నగర్ పట్టణంలోని పటేల్‌రోడ్డుకు చెందిన పలువురు బీజేపీ పార్టీ నాయకులు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో శనివారం సాయంత్రం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ వారికి పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ అందించిన అభివృద్ధిని చూసి పార్టీలో చాలా మంది చేరుతున్నారని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని, రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆయనకోరారు. పార్టీలో చేరిన వారిలో గుడాల రమేష్, తల శివ, భాస్కర్, నరేష్, శేఖర్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ వైస్ ఛైర్మన్ నటరాజన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి ఎంపిపి సన్మానం

త్రిపుర గవర్నర్‌గా నియమితులైన ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:

త్రిపుర గవర్నర్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే నల్లు ఇంద్రసేనారెడ్డిని ఘట్‌కేసర్ ఎంపిపి-బిజెపి రాష్ట్రకార్యదర్శసభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి సన్మానించారు. పార్టీ పటిష్టత కోసం దశాబ్దాల తరబడి సేవలు అందిస్తున్న నేతను బిజెపి అధిష్టానం తప్పకుండా గుర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇంద్రసేనారెడ్డి ప్రజాసంక్షేమం కోసం సైద్దాంతిక నిబద్ధతతో ఎమ్మెల్యేగా, రాష్ట్ర శాఖ అధ్యక్షునిగా అందించిన సేవలు ఈతరం నాయకులకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఈసందర్భంగా త్రిపుర గవర్నర్‌గా నియమితులైన ఇంద్రసేనారెడ్డిని ఎంపిపి సుదర్శన్‌రెడ్డితో పాటు నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘట్‌కేసర్‌లో దుర్గామాతకు ఘనంగా పూజలు



ఘట్‌కేసర్‌లో దుర్గామాతకు పూజలు పాల్గొన్న నాయకులు, దీక్షదారులు

ఘట్‌కేసర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:

ఘట్‌కేసర్‌లో దుర్గామాతకు ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని నిత్యం వివిధ రూపాలలో అలంకరించి నిత్య పూజాది కార్యక్రమాలు చేస్తున్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్ రోడ్డులో మహాంకాళి దేవాలయ ఆవరణలో మాజీ వార్డుసభ్యులు మామిండ్ల ముత్యాలుయాదవ్ ఆధ్వర్యంలో దుర్గామాత మండపాన్ని ఏర్పాటు చేసి అమ్మవారిని ప్రతిష్టించి నవరాత్రి ఉత్సవాలను నిర వ్హిస్తున్నారు. దీక్షపరులు భక్తి, శ్రద్ధలతో అమ్మవారిని పూజించి నిత్యం నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ గావిస్తున్నారు. ఎదులాబాద్‌రోడ్డు పూర్తిగా లైటింగ్ దగదగలాడుతుంది. అంబేద్కర్ విగ్రహం నుంచి మండపం వద్ద వివిధ సెట్టింగ్‌లతో ఆకర్షణీయమైన దేవతామూర్తులు, స్వాగతం తోరణాలు లైటింగ్ అందరిని ఆకట్టుకుంటుంది. ఈనెల 28న దుర్గామాతను పట్టణంలో అంగరంగవైభవంగా ఊరేగించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వహకులు పేర్కొన్నారు. ప్రతియేటా ఘట్‌కేసర్‌లో దుర్గామాత ఉత్సవాలను ఇక్కడ ఘనంగా జరుపుతున్నారు. గురుకుల్‌లో శ్రీభవాని నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్, కార్పొరేటర్ అజయ్‌యాదవ్, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, మేడ్చల్‌బిజ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్ గౌడ్, కౌన్సిలర్లు మల్లేశ్, శశికళ తదితరులు దర్శించుకోగా నిర్వహకులు శివప్రదీప్‌రెడ్డి వారిని శాలువాలతో సన్మానించారు. శనివారం రాత్రి ఇక్కడ దాండియానైట్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు.

శ్రీగాయిత్రి మహాక్షేత్రంలో అమ్మవారు అన్నపూర్ణదేవీగా భక్తులకు దర్శనం

శామీర్‌పేట, అక్టోబరు 21, ప్రభాతవార్త

తూంకుంటలోని శ్రీగాయిత్రి మహాక్షేత్రంలో అమ్మవారు శ్రీ అన్నపూర్ణదేవీగా భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ కేంద్రంలోని శ్రీగాయిత్రి మహాక్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగ అమ్మవారు శ్రీఅన్నపూర్ణదేవీ అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు. పలువురు భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



తూంకుంటలోని శ్రీగాయిత్రీ మాత ఆలయంలో భక్తులకు అమ్మవారు అన్నపూర్ణదేవీగా దర్శనం ఇచ్చిన దృశ్యం

అలియాబాద్ సర్పంచ్ గుర్క కుమార్ యాదవ్ కాంగ్రెస్ గూటికి?

-కొందరు బిసి నాయకులతో బిఆర్ఎస్‌కు బీటలు..తప్పవా..?
-ఫోన్‌లో బుజ్జగింపులకు దిగిన మంత్రి మల్లారెడ్డి
-అలియాబాద్‌లో బిఆర్ఎస్ నాయకుల్లో నెలకొన్న విభేదాలు..?

శామీర్‌పేట, అక్టోబరు 21, ప్రభాతవార్త

అలియాబాద్ గ్రామ సర్పంచు గుర్క కుమార్‌యాదవ్ (బిఆర్ఎస్) ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయం గులాబి శ్రేణుల్లో రాజకీయ నాయకుల్లో చర్చనీయాంశంగ మారింది. బిఆర్ఎస్‌లో ఉన్నా సర్పంచుగ తనకు ప్రాధాన్యత ఇవ్వటం లేదని, తనకు తెలియకుండానే ఇతర ప్రజాప్రతినిధుల, పార్టీ నాయకుల ఆహ్వానం మేరకు మంత్రి మల్లారెడ్డి శామీర్‌పేట మండలంలోని లాల్‌గడిమలకపేట్-అలియాబాద్ గ్రామాల సరిహద్దులో ఉన్న హెచ్‌బిఎల్ కంపెనీకి శుక్రవారం రావటం జరిగిందని తాను బిఆర్ఎస్ పార్టీలో ఉండి ఎందుకని ఆవేదనలో ఉండి తాను పార్టీ మారాలని అనుకున్నట్లు పలువురితో చర్చించినట్లు తెలిసింది. ఇప్పటికే ఆ గ్రామ బిఆర్ఎస్ నాయకుల్లో విభేధాలు కొనసాగుతున్నట్లు చెప్పవచ్చు. దీంతో సర్పంచు గుర్క కుమార్‌యాదవ్ మంత్రి మల్లారెడ్డిపై అలకవహించినట్లు స్పష్టం అవుతుంది. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇన్‌చార్జి సిహెచ్ మహేందర్‌రెడ్డిలు అలియాబాద్ గ్రామ సర్పంచు గుర్క కుమార్‌యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరకుండ అడ్డుకోవటానికి ఫోన్‌లో బుజ్జగింపులు జరిపేందుకు రంగంలోకి దిగారు. బిఆర్ఎస్ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, పలువురు మండల బిఆర్ఎస్ నాయకులు కూడ అలియాబాద్ గ్రామానికి వెళ్లి బిఆర్ఎస్ పార్టీని సర్పంచు కుమార్‌యాదవ్ వీడకుండ ఉండటానికి వెంటనే అలియాబాద్ గ్రామాన్ని వారు సందర్శించారు. అలియాబాద్ గ్రామానికి విచ్చేయగా సర్పంచు కుమార్‌యాదవ్ అందుబాటులో లేనట్లు తెలిసింది. సర్పంచు కుమార్ యాదవ్ ఆయన సెల్‌ఫోన్‌ను కూడ కొన్ని గంటల పాటు స్విచ్‌ఆఫ్ చేసి బయట వెళ్లినట్లు సమాచారం. ఆ తరువాత మురహరిపల్లిలోని ఓ హోటల్ వద్దకు బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి సిహెచ్ మహేందర్‌రెడ్డి, మరి కొందరు పార్టీ నాయకులు పాల్గొని సర్పంచు గుర్క కుమార్‌కు ఫోన్ చేసి మాట్లాడుదామని పిలిపించి చర్చించినట్లు తెలిసింది. అయితే రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి శుక్రవారం సాయంత్రం శామీర్‌పేట మండలంలోని లాల్‌గడిమలకపేట్-అలియాబాద్ గ్రామాల మధ్య ఉన్న హెచ్‌బిఎల్ కంపెనీని సందర్శించినందున తాను వద్దన్నప్పటికీ తనను లెక్క చేయకుండ మంత్రి సందర్శించి తన విలువ లేకుండ చేశారన్న ఆవేదన అసంతృప్తిలో ఉన్నట్లు సర్పంచు గుర్క కుమార్‌యాదవ్ ఆవేదనను వ్యక్తం చేసినట్లు సమాచారం. కార్మికుల సమస్యలు, రోడ్డు సమస్యను పరిష్కరించటానికి చర్చించాల్సి ఉందని అయితే శనివారం రావాలని తాను కూడ ఏర్పాట్లు చేస్తానని మంత్రికి చెప్పిన తరువాత కూడ తనను ఖాతరు చేయకుండ మంత్రి అలియాబాద్-లాల్‌గడిమలకపేట్ (హెచ్‌బిఎల్ కంపెనీని) సందర్శించి కార్మికులతో మాట్లాడటంతో సర్పంచు గుర్క కుమార్‌యాదవ్ మానసిక ఆందోళనకు గురైనట్లు తెలుస్తుంది. బిఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పటికీ సర్పంచుగా తనను గుర్తించకుండ మరి కొందరి ప్రజాప్రతినిధుల, నాయకులతో కలిసి మంత్రి పాల్గొనటం పట్ల ఆయన తీవ్ర నిరుత్సాహానికి గురైనట్లు తెలుస్తుంది. దీంతో తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు అలియాబాద్ గ్రామ సర్పంచు గుర్క కుమార్‌యాదవ్ పేర్కొన్నట్లు ప్రచారం జరగటంతో ఈ విషయం తెలుసుకుని శనివారం ఉదయం అలియాబాద్ గ్రామానికి మేడ్చల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి,పలువురు పార్టీ నాయకులు వెళ్లగా అందుబాటులో లేరని, ఫోన్‌కూడ స్విచ్‌ఆఫ్ వచ్చినట్లు సమాచారం. అయితే ఆ వెంటనే మురహరిపల్లిలోని ఓ హోటల్ వద్దకు ఆ నాయకులు బిఆర్ఎస్ శ్రేణులు ఈ విషయంపై చర్చలు జరపటానికి సర్పంచును రప్పించి చర్చలు

అలియాబాద్‌లో మంత్రి మల్లారెడ్డితో పాల్గొన్న అలియాబాద్ సర్పంచు గుర్క కుమార్‌యాదవ్ దృశ్యం (ఫైల్‌ఫోటో)

జరిపారు. అయితే తాను సర్పంచుగా ఉన్నప్పటికీ మరో ప్రజాప్రతినిధికి ప్రాధాన్యత ఇవ్వటం, తనను దూరంగ పెట్టె విధంగ మాట్లాడుతారని మంత్రి తనను అవమాన పరుస్తున్నారని సిహెచ్ మహేందర్‌రెడ్డి,పార్టీ నాయకుల ముందు సర్పంచు గుర్క కుమార్‌యాదవ్ ఆవేదనను వ్యక్తం చేసినట్లు సమాచారం. మురహరిపల్లిలో బిఆర్ఎస్ నాయకులతో మాట్లాడి తన వాదనను వినిపించినట్లు, మంత్రి మల్లారెడ్డి కూడ ఫోన్‌లో సర్పంచుతో మాట్లాడగ తనకు విలువ లేకుండ పోతుందని, బాధ ఉందని అనటంతో పార్టీ వీడవద్దు మాట్లాడుదామని అన్నట్లు సరే అని చెప్పి సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి మధ్యలోనే అక్కడి నుంచి వెళ్లినట్లు తెలిసింది. అయితే అలియాబాద్ సర్పంచు గుర్క కుమార్‌యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరాలన్న ఆలోచనలో ఉన్నట్లు, తనకు వచ్చే సర్పంచు ఎన్నికల్లో కూడ మరొక ప్రజాప్రతినిధికి మంత్రి మద్దతు ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు, ఆయనకు కొంత ఎక్కువ గానే ప్రాధాన్యత ఇస్తున్నారని భావిస్తు తనకు బిఆర్ఎస్ పార్టీలో న్యాయం జరగదని భావించి అలకవహించినట్లు స్పష్టం అయింది. ఇక మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా తోటకూర వజ్రేశ్‌యాదవ్(జంగయ్యయాదవ్) బరిలో ఉండటంతో బిసిగా, యాదవ సామాజిక వర్గంగ ఉన్నందున కాంగ్రెస్‌లో చేరేందుకు గ్రామ సర్పంచు గుర్క కుమార్‌యాదవ్ యోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. తన క్యాడర్ అభిమానులతో సర్పంచు కాంగ్రెస్‌లో చేరాలని కూడ యోచిస్తున్నట్లు సమాచారం. ఇది ఇలా ఉండగ అలియాబాద్ చౌరస్తా వద్ద అలియాబాద్ గ్రామ బిఆర్ఎస్ నాయకుల సమావేశంను పార్టీ నాయకులు ఏర్పాటు చేయగ దీనిలో మంత్రి మల్లారెడ్డి పాల్గొని బిఆర్ఎస్ నాయకులు పార్టీ నుంచి ఎవరు వెళ్లవద్దని, విభేదాలు ఉన్నా, సమస్యలు ఉన్నా పరిష్కరించుకుందామని వారికి మంత్రి మల్లారెడ్డి సమావేశంలో పార్టీ నాయకులతో చర్చించినట్లు తెలిసింది. మరీ అలియాబాద్ సర్పంచు గుర్క కుమార్‌యాదవ్ బిఆర్ఎస్‌లో ఉంటారా లేక కాంగ్రెస్ గూటిలోకి చేరుతారా అనేది వేచ్చి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం శామీర్‌పేట మండలంలో రాజకీయంగ చర్చనీయాంశంగ మారింది. మేడ్చల్ బిఆర్ఎస్ అభ్యర్థిగా మంత్రి మల్లారెడ్డి(టిసి) ఉండటం, మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థిగా తోటకూర వజ్రేశ్‌యాదవ్(జంగయ్యయాదవ్) ఉండటంతో ఆ గ్రామ సర్పంచు గుర్క కుమార్‌యాదవ్ బిఆర్ఎస్‌లో అసంతృప్తితో ఉండి కాంగ్రెస్‌లో చేరాలన్న ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. బిసి సామాజిక వర్గంగ ఉంటారన్న ఆలోచననా..లేక బిఆర్ఎస్‌లో అసంతృప్తితోనా అనేది కూడ తెలియాల్సి ఉంది. బిఆర్ఎస్‌లో ఉన్న బిసి నాయకులతో మీటలు మరీ పార్టీలో ఉంటారా..పార్టీ మారుతారా అనేది వేచి చూడాల్సిన అవసరం ఉందని చెప్పవచ్చు.

అమరుల త్యాగాలు వృధా కానివ్వం
-ఎస్సై బల్‌రాంనాయక్

ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌లో దివంగత ఎస్సై హన్మంతురెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎస్సై బల్‌రాంనాయక్

ఆమనగల్లు, అక్టోబర్21, ప్రభాతవార్త:

పోలీసు అమరుల త్యాగాలను వృధా కానివ్వమని, రక్షకభటులు సిద్దాంతాలు, ఆశయాలు కొనసాగిస్తూ సమాజంలో శాంతిభద్రతలను కాపాడుతామని ఆమనగల్లు ఎస్సై బల్‌రాంనాయక్ అన్నారు. సమాజాశ్రేయస్సుకు పాటుపడుతూ ఎంతో మంది పోలీసులు తమ ప్రాణాలను త్యాగాలు చేశారని ఆయన కొనియాడారు. అక్టోబర్21 పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా నిర్వహించారు. సిబ్బందితో కలిసి ఎస్సై బల్‌రాంనాయక్ కార్యాలయ ఆవరణలో ఉన్న దివంగత ఎస్సై హన్మంతురెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం హన్మంతురెడ్డి సేవలను జ్ఞాపికి తీసుకువచ్చి కొనియాడారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, శివకుమార్ తదితరులు ఉన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు

మహిళలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

కొత్తూర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :

తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వైభవంగా నిర్వహించుకునే బతుకమ్మ పండుగను 9రోజులు వివిధ రకాలైన పూలతో అలంకరణలతో ఆడపడుచులు బతుకమ్మలను తయారు చేసి పూజిస్తారు. అందులో భాగంగా అమావాస్య రోజు ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు కొత్తూర్ పురపాలికలోని కొత్తూర్ పురపాలికలోని నారాయణగూడ కాలనీలో శ్రీలింగేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబురాల్లో కాలనీలోని ఆడపడుచులు వివిధ రకాల బతుకమ్మలను తయారు చేసి ఆటపాటలతో సందడి చేశారు. ఈకార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ బీసీసెల్ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ పాల్గొని బతుకమ్మలను ఏర్పాటు చేసిన ఆడపడుచులకు తగిన బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... నేటితరంలో ఇలాంటి సంస్కృతి సాంప్రదాయ కార్యక్రమాలు చేపడుతున్న శ్రీలింగేశ్వర యూత్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్న యువత ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో యూత్ సభ్యులు అమిత్,సుమిత్, హరి, శివ, లక్ష్మణ్, ఆశోక్, రాజా, లడ్డు, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

తెలంగాణను దోచుకుతింటున్న కేసిఆర్ కుటుంబం కాంగ్రెస్ అభ్యర్థి మాజీ మంత్రి చంద్రశేఖర్

ఝరాసంగం, అక్టోబరు 21, ప్రభాతవార్త: కష్టపడి తెచ్చుకున్న తెలంగాణను కల్వకుంట్ల కుటుంబం దోచుకుతింటోందని మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆగం చంద్రశేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. వస్తున్నా... మీ కోసం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని వనంపల్లి, పుర్య నాయక్ తండా, కక్కరవాడ గ్రామాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చంద్రశేఖర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో చంద్రశేఖర్ మాట్లాడుతూ బిఆర్ఎస్‌కు ఓటేస్తే దొంగ మంత్రి హరీష్‌రావు చేతికి తాళం ఇచ్చినట్లేనని ఆరోపించారు. జహీ రాబాద్ ప్రాంతంలో కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి చెందిందని, బిఆర్ఎస్ హయాంలో ఏం చేశారో ప్రకటించాలని ప్రశ్నించారు. గత ఎన్నికల సందర్భంగా చేసిన హామీలనే నెరవేర్చని బిఆర్ఎస్ ఇప్పుడు కొత్తగా హామీలు ఇవ్వడం ప్రజలను మోసం చేయడం కాదా అన్నారు. కేసిఆర్ కుటుంబం అవినీతి రాష్ట్రం దాటి దేశానికి చేరుకుందని వ్యం గంగా విమర్శించారు. ఆయా గ్రామాల్లో నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా చంద్రశేఖర్ పార్టీ ఖండువాలు కప్పి స్వాగతం పలికారు. కార్యక్ర మంలో పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి ఉజ్వల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు హన్మంత్‌రావు పాటిల్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఉదయ్‌శంకర్ పాటిల్, ఎంపిపి కటికే దేవదాస్, వైస్ ఎంపిపి మల్లన్న పాటిల్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు మోహన్‌రెడ్డి, నర్సింలు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

జహీరాబాద్, అక్టోబరు 21, ప్రభాతవార్త: పట్టణంలోని వసంత్ విహార్, దత్తగిరి, ఆదర్శ్ నగర్, వాసవి కల్యాణ మండపంలో కాలనీలతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం ఆయా చోట్ల అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పాటలు పాడుతూ సంబరాలు చేసుకున్నారు. బతుకమ్మలను బావుల్లో, చెరువ్లో పూజలు నిర్వహించి నిమర్జనం చేశారు.

విస్తరణ ప్రణాళికలలో భాగంగా చర్యలు

శామిర్ పేట అక్టోబర్21,ప్రభాతవార్త : ఆయుర్వేదం..మూలికా.వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల వ్యాపారం చేసే వీర్ హెల్త్ కేర్ లిమిటెడ్ సంస్థకు

జాతీయ మహాసభలను విజయవంతం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

జిల్లెడు చౌదరిగూడ, అక్టోబర్ 21,(ప్రభాతవార్త):
తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు జాతీయ మహా సభలను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య అన్నారు. శనివారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని చెన్నారెడ్డి గూడ గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ నవంబర్ 2నుంచి 5వరకు బీహార్ రాష్ట్రం లో పాట్నాలో జరుగు జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పెర్కోన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండ ల కార్యదర్శి వెంకటేష్, చిన్నయ్య, లింగం, చంద్రయ్య, బుచ్చ య్య, వెంకటమ్మ, చందర్ తదితరులు పాల్గొన్నారు.

యజ్ఞంతో వర్షాలు సకాలంలో కురుస్తాయి

యజ్ఞంలో పాల్గొన్న బాబురావు దంపతులు

జిల్లెడు చౌదరిగూడ, అక్టోబర్ 21,(ప్రభాతవార్త):
గ్రామాల్లో యజ్ఞాలు చేయడం వల్లన వర్షాలు సకాలంలో కురు స్తాయని జిల్లెడు చౌదరిగూడ మండలంలోని జిల్లెడు గ్రామ సర్పంచ్ బాబురావు అన్నారు. శనివారం గ్రామంలో దుర్గామాత అమ్మవారి వద్ద ప్రత్యేకంగ యజ్ఞం కార్యక్రమాన్ని బాబురావు శృతి దంపతులు నిర్వహించారు.కార్యక్రమంలో బాలమణి, సత్యయ్య, సుస్మిత, మహెష్, నరేష్, రాజు, ప్రభాకర్, కళ్యాన్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి
-ఎంపీపీ రవీందర్‌యాదవ్

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రవీందర్‌యాదవ్

కొత్తూర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :
కొత్తూర్ మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో శనివారం సర్పంచ్ అజయ్ మిట్టునాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్ ఎస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్ పాల్గొని పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.తెలంగాణ రాష్ట్రం బీఆర్ఎస్ పార్టీ హయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ, మాజీ మండల అధ్యక్షులు పెంటన్నోళ్ల యాదగిరి, కొత్తూర్ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, మిట్టు నాయక్, సిరాజ్, రసీద్, లావుడ్య గోపాల్‌నాయక్, శ్రీరాములుయాదవ్, ఇంద్రసేనారెడ్డి, సతీష్‌గుప్తా, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీకి శ్రీరామరక్ష

తలకొండపల్లి అక్టోబర్21,ప్రభాతవార్త :
సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీకి శ్రీరామ రక్ష అని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పేర్కొన్నారు.శనివారం తలకొండపల్లి మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఇంటింటి తిరిగి బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను వివరించారు.అనంతరం వివిధ పార్టీలకు చెందిన నాయ కులు కార్యకర్తలు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....పేద ప్రజలకు మేలు జరగాలంటే మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలని కోరారు.కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెం కటేష్,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సిఎల్ శ్రీనివాస్ యాదవ్, ఎంపిపి నిర్మల శ్రీశైలం గౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,పాక్స్ వైస్ చైర్మన్ రవి,ఎంపిటిసి సరితా గణేష్ గుప్తా,మండల పార్టీ అధ్యక్షుడు శంకర్,రైతు బంధు అధ్యక్షుడు పద్మ,నర్సింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి,సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోపాల్ నాయక్,గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింహ,వివిధ గ్రామాల సర్పంచ్‌లు,ఎంపిటిసిలు ,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరిన విద్యావేత్త రామేశ్వర్ గౌడ్

మ్మెల్యే అంజయ్య యాదవ్‌ను నందిగామలో సాదరంగా ఆహ్వానిస్తున్న ఎర్ర అంజయ్య గౌడ్

నందిగామ అక్టోబర్21,ప్రభాతవార్త :
నందిగామ మండల కేంద్రానికి చెందిన విద్యావేత్త మాజీ ఎంపిటిసి ఎర్ర అంజయ్య గౌడ్ తనయుడు ఎర్ర రామేశ్వర్ గౌడ్ శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు.సంక్షేమ పథకాల స్ఫూర్తి ప్రధాత సిఎం కెసిఆర్ ఎన్నికల మేనిఫెస్టోకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు పేర్కొ న్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ సమక్షం లో గులాబీ కండువాను కప్పుకొని బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో కలిసిన వారిలో రామేశ్వర్ గౌడ్,అభిమానులు,కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో చేరారు.షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను భారీ మెజా ర్టీతో గెలిపించుకుంటేనే అందరి జీవితాలు వెలుగుతాయన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జిల్లెల వెంకట్ రెడ్డి,అడ్వకేటు విక్రం శర్మ, మాజీ ఎఎంసి చైర్మన్ నారాయణ రెడ్డి,ఎర్ర ప్రభాకర్ గౌడ్,ఎర్ర శ్రీకాంత్ గౌడ్,ఎర్ర మధుసూదన గౌడ్,ఎర్ర శ్రీనివాస్ గౌడ్,స్థానిక బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలి

- నియోజకవర్గంలో 527064 మంది ఓటర్లు
- 542 పోలింగ్ కేంద్రాలు : అధికారి సూరజ్‌కుమార్

రాజకీయ పార్టీలతో సమావేశమైన మహేశ్వరం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఆర్డీఒ సూరజ్‌కుమార్

కందుకూరు, అక్టోబర్ 21, ప్రభాతవార్త:
ఓటర్ల సౌలభ్యం కోసం ఎన్నికల కమీషన్ అదేశాల ప్రకారం మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గంలో అదనంగా 31 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయడం జరిగిం దని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కందుకూరు ఆర్డీఒ సూరజ్‌కుమార్ తెలిపారు, ఎన్నికల ఏర్పాట్లలలో బాగంగా శనివారం ఆయా రాజకీయ పార్టీల ప్రతినిదులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఒ మాట్లాడుతు ఎన్ని కల కమీషన్ నిబందనల మేరకు 1500 వందల ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రం లో అదనపు పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలిని ఎన్నికల కమీషన్ అదేశాల మేరకు మహేశ్వరం నియోజనవర్గంలో అదనంగా 31 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయడం జరుగుతుందని సూచించారు. నియోజకవర్గం పరిదిలో ప్రస్తుతం 511 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని స్తానిక పరిస్తితుల మేరకు నియోజకవర్గం పరిధి లోని బాలాపూర్ మండల పరిదిలో అదనంగా 30 పోలింగ్ కేంద్రాలు, సరూర్ నగర్‌మండల పరిదిలో 1 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుంద న్నారు. నియోజకవర్గం పరిదిలో 4 మండలాలో మొత్తం 527064 ఓటర్లు ఉండగా అందులో పురుష ఓటర్లు 271469 ఉన్నారని మహిళా ఓటర్లు 2555 28 ఉండగాట్రాన్స్‌జెండర్లు 67 మంది ఉన్నారని అయన తెలిపారు. ఓటర్ల సంఖ్యను పరిగణలోకి తీసుకుని నిబందనల ప్రకారం542 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మండలాల వారిగా ఓటర్లు సంఖ్య పోలింగ్ కేంద్రాల సంఖ్య ఈవిదంగా ఉంటుందని అయన సూచించారు. కందు కూరు మండలంలో మొత్తం ఓటర్లు 49525 మంది ఓటర్లు ఉండగా అందులో పురుష ఓటర్లు 25221 మంది, మహిళా ఓటర్లు 24303 మంది ట్రాన్స్‌జెం డర్‌లు 1 ఉన్నారు. ఇక్కడ పోలింగ్ కేంద్రాల సంఖ్య 61. మహేశ్వరం మండలం లో మొత్తం ఓటర్లు 64480 ఇందులో పురుష ఓటర్లు 32907 మహిళా ఓటర్లు 32566 కాగా ట్రాన్స్‌జెండర్‌ల సంఖ్య 7 పోలింగ్ స్టేషన్‌ల సంఖ్య 72. బాలా పురం మండలంలోమొత్తం ఓటర్లు 291215 కాగా పురుష ఓటర్లు 149645 మహిళా ఓటర్లు 141514 ట్రాన్స్‌జెండర్‌లు 56పోలింగ్ కేంద్రాల సంఖ్య 275. సరూర్‌నగర్ మండల పరిదిలో మొత్తం ఓటర్లు 121844 కాగా పురుషులు 63696,మహిళలు 58145, ట్రాన్స్‌జెండర్‌లు 3 చొప్పున ఉండగా పోలింగ్ కేం ద్రాల సంఖ్య 134 ఏర్పాటు చేయడం జరిగిందని అధికారి తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో సరైన వెలుతురు, గాలిఉండేలా ఏర్పాటు చేయడం తోపాటు దివ్యాంగులు పోలింగ్ కేంద్రంలోకి సజావుగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావలి ప్రకారం నడచుకో వాలని ఎన్నికల అధికారులకు సహకరించాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఎంటే ఎన్నికల అధికారులకు తెలియజేయాలని కోరారు.

కల్వకుర్తి నియోజకవర్గంలో దూసుకుపోతున్న కాంగ్రెస్

-కాంగ్రెస్ పార్టీలో చేరిన గోవిందపల్లి సర్పంచ్ రవి

పార్టీలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న దృశ్యం

కడ్తాల్,అక్టోబరు 21 ప్రభాతవార్త :
మండల కేంద్రంలోని మండల పార్టీ అధ్యక్షులు బిచ్యానాయక్, శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయ ణరెడ్డి సమక్షంలో బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన గోవిందపల్లి గ్రామ సర్పం చ్ కంబాలపల్లి రవి, వార్డు మెంబర్లు నిట్ట రమేష్, వల్లపుదాసు శ్రీకాంత్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ నియోజ కవర్గ అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోకుండా అధికార బిఆర్ఎస్ ప్రభుత్వ హామీ లను నెరవేర్చని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను, కేంద్ర ప్రభుత్వ విధానాలతో మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్న బిజెపి పార్టీ నేత ఆచారిలను ఇంకా నమ్మ డానికి కల్వకుర్తి ప్రజలు సిద్దంగా లేరని అన్నారు. వాళ్ల ఓటమి ఇప్పటికే ఖాయం అయిందని అందుకే నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ముందు కు వస్తున్నారని అన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే కాబట్టి ఎవరు అధైర్య పడొద్దని మళ్లీ ఇందిరమ్మ రాజ్యం వస్తుందని అందరికి సంక్షేమ ఫలాలు అందు తాయని ఇండ్లులేని నిరుపేదలకు ఆనాడే ఎన్నో ఇందిరమ్మ ఇండ్లు కట్టించామని, రైతులకు, పేదలకు, యువతకు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందని అన్నారు. రాబోయే 40 రోజులు కలిసి కట్టుగా కష్టపడితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని 5 సంవత్సరాలు నియోజ కవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. వివిధ పార్టీల నుండి చేరిన వారిలో వెంకటయ్య, అంజయ్య, అభిలాష్, బాల రాజ్, కృష్ణయ్య, నరసింహ, శేఖర్, ప్రశాంత్, వంశీ, శ్రీకాంత్‌తో పాటు మరో 50 మంది కార్యకర్తలు, నాయకులు ఉన్నారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి బిఖ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేష్, కో ఆప్షన్ సభ్యులు జాంగీర్‌బాబా, గ్రామ సర్పంచ్ శంకర్, లక్ష్మయ్య, ఇక్బాల్‌పాషా, రాంచం దర్ నాయక్, అశోక్, రామకృష్ణ, జగన్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, జహంగీర్, హన్మా నాయక్, వేణు పంతులు, కేశవులు, యాదయ్య, జవహర్‌లాల్, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మ ణ్, జంగయ్య, శాబుద్దిన్, భానుకిరణ్, క్యామ రాజేష్, ఎర్రోళ్ల శ్రీకాంత్, రాజేందర్ గౌడ్, భరత్‌యాదవ్, రామకృష్ణ, రమేష్‌నాయక్, ప్రవీణ్‌గౌడ్, పాండు, వెంకటేష్, శ్రీనునాయక్, సేవ్యా, రాజు, శ్రీశైలం, మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి : బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలపై ప్రచారం చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి.

- తాండూరులో కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలపై విస్తృత ప్రచారం

తాండూరు, అక్టోబరు 21, ప్రభాతవార్త :
కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నాయకులు బుయ్యని శ్రీనివా స్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలతో వచ్చే ఎన్నిక ల్లో ఘన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శనివారం తాండూరు మున్సిపల్ పరిధిలోని 4,5,6వ వార్డులలో కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలపై విస్తృ త ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షులు ప్రభాకర్, యువజన కాంగ్రెస్ నాయకులు కావలి సంతోష్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగుతూ కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్య తిరేఖ విధానాలను ప్రజలకు గుర్తు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నా రు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. గత తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనతో ప్రజలకు ఒరిగిందేమి లేదని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అనుసరి స్తున్న తీరుపై ప్రజలు విసుగెత్తిపోయారని అన్నారు. తాండూరులో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల అభ్యు న్నతికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయ కులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ఇంటింటి ప్రచారం

ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రేస్‌పార్టీ నాయకులు.

బొంరాస్‌పేట్,అక్టోబర్21,ప్రభాతవార్త ఃి
తెలంగాణ రాష్ట్ర కాంగ్రేస్‌పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల కార్డు గురించి బొంరాస్‌పేట్ మండలం కోత్తూర్ గ్రామంలో సర్పంచ్ మహేందర్,ఎంపిటిసి భీంరెడ్డి అధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రేస్‌పార్టీ నాయకులు పాల్గోని ప్రజలకు వివరించడం జరిగిందన్నారు.ఇంటింటి తిరుగుతూ మహాలక్ష్మి ద్వార మహిళలకు ప్రతినెల 2వేల 5వందలు,5వందలకే గ్యాస్ సిలిండర్,ఆర్‌టీసి బస్సుల్లో ఉచితప్రయా ణం,రైతులకు ప్రతి ఏటా 15వేలు రైతుబంధు,వ్యవసాయ కూలీలకు 12వేలు,వరి పంటకు 5వందల బోనస్,గృహజ్యోతి ద్వార ప్రతి కుటుంబానికి 2వందల యూనిట్ల ఉచిత విద్యుత్,ఇందిరమ్మ ఇండ్లు ఇంటిస్థలంతోపాటు ఇంటి నిర్మాణం కోసం 5లక్షలు, ఉద్యమకారులకు 250చ,గ ఇంటి స్థలం,యువ వికాసం ద్వార విద్యార్థులకు 5లక్షలు. మండల కేంద్రంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు,చేయూత ద్వార నెలకు 4వేల పింఛను,10లక్షలతోరాజీవ్ ఆరోగ్యశ్రీ భీమా వంటి ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరి స్తుంటే ప్రజల నుండి మంచి స్పందన ఉందని వారు తెలిపారు.కాంగ్రేస్‌పార్టీ కొడంగల్ ఎమ్మెల్యే అభ్యర్థి రేవంత్‌రెడ్డికి ఓటువేసి గెలిపించాలని వారు కోరారు.ఆరు గ్యారంటీల కార్డు ప్రచారం మండల వ్యాప్తంగా నాయకులు,కార్యకర్తలు వివిధ గ్రామాల్లో ఇంటిం టికి తిరుగుతూ ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రవీణ్‌కుమార్,యువజన సంఘాల అధ్యక్షులు బాలరాజ్,బూత్‌కమిటీ సభ్య లు ఉదయ్,కిషన్‌నాయక్,కాంగ్రేస్‌పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గోన్నారు.

ఎన్నికల కోడ్‌తో నామమాత్రంగా కందుకూరు మండల సర్వసభ్య సమావేశం

కందుకూరు, అక్టోబర్ 21, ప్రభాతవార్త:
శనివారం జరిగిన కందుకూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎన్నికల కోడ్ ప్రతిబందకంగా మారింది. ఎంపిపి మందజ్యోతిపాండు అధ్యక్షతన మండల సమావేశ ప్రాంఘనంలో జరిగిన ఈ సమావేశానికి ఎన్నికల నియమాల ప్రకారం అధికారుల వివిద డ్యూటీలలో ఉండగా మెజారిటీ సర్పంచ్‌లుసమావేశానికి దూరంగా ఉన్నారు. ఎంపిటిసిలు హజరైనా అయా అంశాలపైన సరైన చర్చ జరుగకపోవడంతో గంట లోపలే సమావేశాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి బొక్క జంగారెడ్డి, మహేశ్వరం మార్కెట్ కమిటీ చేర్మెన్ ఎస్ సురేందర్‌రెడ్డి, పిఏసిఎస్ చేర్మెన్ చంద్రశే ఖర్, అయా గ్రామాల ఎంపిటిసిలు కిందిస్తాయి అధికారులు, ఎంపిడిఒ వెంకట్రా ములు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్న దేవాలయంలో పునఃప్రారంభమైన పనులు

ఆళ్ళగడ్డ నుండి తీసుకువచ్చిన విగ్రహాలను పరిశీలిస్తున్న తోట గిరియాదవ్, శ్రీకృష్ణయాదవ సంఘం సభ్యులు

ఆమనగల్లు, అక్టోబర్21, ప్రభాతవార్త: ఆమనగల్లు పట్టణ సమీపంలోని కొండమీద నిర్మిస్తున్న మల్లన్న (శివాలయం) దేవాలయ నిర్మాణ పనులు తిరిగి మొదలయ్యాయి. శ్రీకృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆలయం ప్రస్తుతం సగభాగం పూర్తి అయ్యాయి. మిగులు పనులు పూర్తి చేసేందుకు అభివృద్ధి కమిటీ చర్యలు చేపట్టింది. ఆల యంలో ప్రతిష్టించేందుకు కావల సిన నంది, ధ్వజస్థంభం, ఇతర విగ్రహాలను రాయలసీమ ప్రాం తంలోని ఆళ్ళగడ్డలో ప్రత్యేక శిల్పిలచే తయారు చేయించిన శి లా విగ్రహాలను శనివారం ప్రత్యే క వాహనంలో ఆలయం వద్దకు దిగుమతి చేసుకున్నారు. మల్లన్న విగ్రహాన్ని పుణ్యక్షేత్రం కంచీలో ప్రత్యేక శిలతో తయారుచేయించి ప్రతిష్టించనున్నట్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట గిరియా దవ్ తెలిపారు. అభివృద్ధి పనుల ను త్వరితగతిన పూర్తి చేసి విగ్ర హా ప్రతిష్టాపన చేయాలనే లక్ష్యం తో ముందుకు సాగుతున్నట్లు ఆ యన వివరించారు. కార్యక్రమం లో తోట బుచ్చయ్య, తోట మల్లే శ్, తోట ఆనంద్, తోట కృష్ణ, తోట శ్రీను, తోట శ్రీను, దుడ్డు సురేష్, వెంకటేశ్, కావటి కొండ ల్, శ్రీపతి వెంకటేశ్, నరేష్, తో ట అభిషేక్, నారమోని దశరథ, తోట శివ తదితరులు ఉన్నారు.

PUBLIC NOTICE

The general public is hereby informed that my client **Ravi Jain** intend to purchase the under mentioned property from **Sri. Siripurapu Bhujanga Rao** S/o. Subba Rao& Jarubula Chenchu Ravindra Babu S/o. K.Butchaiah R/o. H.No.Villa No.57, Springwoods, Praneethnagar, Beside Mallampet ORR, Shambhipur Village, Hyderabad, Telangana-500043 and has paid advance sale consideration.

SCHEDULE OF PROPERTY

All that theOpen Land bearing Plot No.444 in "Aparna Western MeadowsPhase-III" admeasuring 266.71 Sq.Yards, forming part of Sy.no. 418(P) of Kodangal Village, Shankarpalli Mandal, Rangereddy District, under the limits of the Grampanchayat Kodangal Village, Shankarpalli Mandal, Rangareddy, Telangana in the Registration District of Rangareddy and Sub-Registrar of Shankarpalli. and bounded as follows: North: Plot No.443, South: Plot No. 445, East: Plot No.425, West: 12.19 M' Wide Road.

Any person/persons having any objection for the sale transaction may contact the undersigned with relevant documents within one week from today. Any objection made thereafter will not be binding my clients.

R. ARUN KUMAR
Advocate-High Court of Telanga
H/o 1-5-568/26, Suryanagar Colony, Near Suryanagar Kaman, Old Alwal Secunderabad-500010
Cell No.9963678897

గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని కలిసి శుభాకాంక్షాలు తెలిపిన బిజెపి నాయకులు

ఇటీవల త్రిపుర గవర్నర్‌గా నియమితులైన ఇంద్రసేనారెడ్డిని కలిసి శాలువా కప్పి శుభాకాంక్షాలు తెలిపిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ. నర్సింహ తదితరులు.

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:
ఇటీవల త్రిపుర గవర్నర్‌గా నియమితులైన నల్లు ఇంద్రసేనారెడ్డిని శనివారం పోచారం మున్సిపల్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులు కలిసి శుభాకాం క్షాలు తెలిపారు. గవర్నర్ ఇంద్రసేనా రెడ్డిని కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అచ్చిని నర్సింహా, పోచారం మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు సురేశ్ నాయక్ తదితరులున్నారు.

అవుశాపూర్ పంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ

అవుశాపూర్ గ్రామ పంచాయతీ సిబ్బందికి దసరా సందర్భంగా దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కావేరి దంపతులు.

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:
నిత్యం ప్రజలకు సేవలు అందించే గ్రామ పంచాయతీ సిబ్బందికి దసరా పర్వ దీనం సందర్భంగా నూతన వస్త్రాలు పంపిణీ చేసినట్లు అవుశాపూర్ గ్రామ సర్పంచ్ ఏనుగు కావేరి అన్నారు. అవుశాపూర్ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం సర్పంచ్ దంపతులు ఏనుగుకావేరి మశ్చేందర్‌రెడ్డిలు పంచాయతీ సిబ్బందితో పాటు ఎన్ఆర్ఈజీఎస్ శ్రామికులకు దుస్తులు అందజేసినట్లు తెలిపారు. పంచాయతీ సిబ్బంది ప్రజలకు అందిస్తున్న సేవలు కొనియాడ దగినవని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు నాయకుడు మశ్చేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు మద్దతుగా ఏకమవుతున్న ఇతర పార్టీల నేతలు

బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

కొత్తూర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :
షాద్‌నగర్ నియోజకవర్గంలో హ్యాట్రిక్ సాధించడమే లక్ష్యంగా షాద్‌నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అంజయ్యయాదవ్ దూకుడు పెంచారు. కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్‌లో వైస్ చైర్మెన్ డోలి రవీందర్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన 30మంది బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి కేశంపేట్ ఎంపీపీ రవీందర్‌యాదవ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... పట్టణాలకు ధీటుగా తమ అవా సాలను అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు మద్దతుగా పల్లెలన్ని ఏకమవుతున్నాయన్నారు. ఈకార్యక్రమంలో చైర్‌పర్సన్ బాతుక లావన్య దేవేందర్‌యాదవ్, ఏనుగు జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజేందర్‌గౌడ్, చేగురి మాధవరెడ్డి, పీర్లగూడ శంకరయ్యగౌడ్, అమ్మపురం నర్సింహగౌడ్, మొగిలిగిద్ద భాస్కర్‌గౌడ్, గణేష్, పుసుపుల శేఖర్, డోలి శ్రీనివాస్, నరసింహా రెడ్డి,పాశం శ్రీధర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి ఇందిరమ్మ రాజ్యం తెస్తాం
-కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి

తలకొండపల్లి అక్టోబర్21,ప్రభాతవార్త : రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నిక ల్లో ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని పేదలను గుర్తించే ఇందిరమ్మ రాజ్యం తెస్తామని కాంగ్రెస్ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు.శనివారం తలకొండపల్లి మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో హాజరై కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ...పేద ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలను ప్రకటించిందని వాటన్నింటిని పేద ప్రజలకు అందాలం టే కాంగ్రెస్ పార్టీకి ప్రతి ఒక్కరూ ఓటు వేసి గెలిపించాలని ఆయన అన్నారు. ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి అనేక హామీలు ఇచ్చి మరిచాడన్నా రు.స్వయాన తన కూతురు సర్పంచ్ పదవి కోసం వెల్జాల్ గ్రామాన్ని మండ లంగా ఏర్పాటు చేస్తానని హామి ఇచ్చి మరిచాడని ఆయన విమర్శించారు. కల్వకుర్తి నియోజకవర్

ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

-తహసీల్దార్ వెంకటేష్,దానయ్య,ఎస్ఐ శంకర్

సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

బొంరాస్‌పేట్,అక్టోబర్21,ప్రభాతవార్త ఃి

వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్పి కార్యలయంలో అక్టోబర్ 21న నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం లో బొంరాస్‌పేట్ ఎస్ఐ శంకర్ పాల్గొని విధి నిర్వహణలో నిస్వార్థంగా వారు చేసిన సేవలను గుర్తుచేస్తూ పోలీస్ అమర వీరుల స్థూపం దగ్గర గౌరవ వందనంతో నివాళులు అర్పించారు.అనంతరం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ అవరణలో బొంరాస్‌పేట్,దుద్యాల్ మండలాల తహసీల్దార్లు వెంకటేష్, దానయ్య,ఎంపిఓ పాండునాయక్,సిబ్బంది అధ్వర్యంలో జిల్లా ఎస్పి ఆదేశాలతో రెండు మండలలాలకు చెందిన వివిధ పార్టీల ముఖ్యనాయకులు,జడ్‌పిటీసి,ఎంపిటీసిలు,సర్పంచ్‌లతో అన్ని పార్టీల నాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలకు సంబంధించిన గోడపత్రికలు,జెండాలకు అనుమతులు తీసుకోవాలని,ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు అధికారులకు సహకారించాలని తహసీల్దార్లు,ఎస్ఐ కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవిచారి,పోలీస్ సిబ్బంది,వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌కు బిగ్ షాక్

-సొసైటి డైరెక్టర్‌తో పాటు మాజీ వైస్‌చైర్మెన్, మాజీ సర్పంచ్‌లు రాజీనామా

-డీసీసీబి చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

పెద్దేముల్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:

బిఆర్ఎస్ పార్టీకి పలువురు నాయకులు మూకుమ్మడి రాజీనామా చేయడంతో ఆ పార్టీకి ఊహించని షాక్ తగిలింది. బిఆర్ఎస్‌లో తమకు సముచిత స్థానం లభించ డంలేదని నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి డీసీసీబి చైర్మెన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మండల బిఆర్ఎస్‌పార్టీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సొసైటి డైరెక్టర్ ఎస్.నారాయన్‌రెడ్డి, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ ఉపాద్యాక్షులు జితేందర్‌రెడ్డి, మారెపల్లి మాజీ యంపిటిసి కొమ్ము గోపాల్‌రెడ్డి, కందనెల్లి మాజీ సర్పంచ్ మధుసుధన్‌రెడ్డి, జనగాం విజయకుమార్, మాజీ ఉప సర్పంచ్ శివకుమార్, మంబాపూర్ మాజీ యంపిటిసి భర్త గంగసారం క్రిష్టారెడ్డి, బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు జి.హర్షవర్ధన్‌రెడ్డి, వార్డు సభ్యులు యేసు, లాజర్, ఖానాపూర్ నాయకులు గోపాల్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు శనివారం బిఆర్ఎస్‌పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్‌లో తమకు తగిన గుర్తింపు లేకపోవడం వల్ల తాము ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు చెప్పారు. మండల స్థాయిలో ఉన్న తమను గ్రామ స్థాయికి దిగజార్చరని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన మెనిపెస్టో నచ్చినందున తామూ ఆ పార్టీలో చేరుతున్నామని అన్నారు. తాము ప్రజా సేవ చేసేందుకు బుయ్యని మనోహర్‌రెడ్డి అధ్వర్యంలో పనిచేసి మండలం నుంచి కాంగ్రెస్‌పార్టీకి 5 వేల మెజార్టీ సాధించి తీరుతామని శపథం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మైనార్టీ కన్వీనర్ యండి రియాజ్, మాజీ జడ్‌పిటిసి అంజయ్య, యువనాయకులు రుద్రారం మహిపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి సీనియర్

మనోహర్‌రెడ్డితో మర్యాద పూర్వకంగ కలిసిన బిఆర్ఎస్ నాయకులు

నాయకులు ఉప్పరి మల్లేశం,కుర్వ మల్లేశం,శ్రీనివాస్‌రెడ్డి,వీరేశంగౌడ్ పాల్గొన్నారు.

మాయ మాటలతో ప్రజలను మోసం చేయడంలో కేసిఆర్‌ది ప్రథమ స్థానం

-డీసీసీబి చైర్మెన్ బుయ్యని మనోహర్‌రెడ్డి

మాయ మాటలతో ప్రజలను మోసం చేయడంలో సిఎం కేసిఆర్‌ది ప్రథమ స్థానం అని డీసీసీబి చైర్మెన్ బుయ్యని మనోహర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో బిఆర్ఎస్‌కు రాజీనామా చేసిన పలువురు నాయకులను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి కాంగ్రెస్‌లోకి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నష్టపోతున్న ఆలోచించకుండా ప్రత్యేక తెలంగాణను ఇచ్చిన ఘనత సోనియాదేనని అన్నారు. నీళ్ళు,నిధులు, నియామకాలు ఇస్తారని ఆశపడి కేసిఆర్‌ను సిఎం చేస్తే ప్రజల ఆశలను వమ్ము చేసారని విమర్శించారు. దళిత సిఎం, మూడెకరాల భూమి, డబుల్‌బెడ్ రూం ఇండ్లు, రుణమాఫీ, కరెంటు తదితర విషయాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. నకల్ మార్నెకు అకల్ రహేనా అన్న చందంగా బిఆర్ఎస్ కాంగ్రెస్ పథకాలను కాపి కొట్టారని ఎద్దేవా చేశారు. యువ వికాసం, గృహలక్ష్మి, గ్యాస్ ధర తగ్గింపు, ఆరొగ్య శ్రీ, రుణమాఫీ తదితర పథకాలతో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. మన జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి సిఎం కావడంతో సిరిసిల్లా, గజ్వెల్, సిద్దిపేట మాదిరిగా వికారాబాద్ జిల్లా అభివృద్ది చెందుతుందని భరోసా ఇచ్చారు. డిసెంబర్ 9న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సిఎంగా ప్రమాణం చేస్తారని, ఆరు గ్యారెంటీలపై తొలి సంతకం చేస్తారని అన్నారు. సీనియర్ నాయకుల సూచనల మేరకు తాను నడు చుకుంటానని, ప్రజల ఆదరణ చూస్తుంటే తాండూరు గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురువేయడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కార్యకర్తలు, పార్టీ శ్రేణులు సమిష్టిగా కృషిచేసి కాంగ్రెస్ విజయంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు ఇంటింటికి ప్రచారం చేయాలి : సురేందర్ రెడ్డి

అన్నోజిగూడలో బీఆర్ఎస్ మ్యానిమేస్టో పత్రాన్ని ఆవిష్కరించిన మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, చైర్మన్ కొండల్ రెడ్డిలు.

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:

ఇంటింటికి తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను బూత్ కమిటీ సభ్యులు ప్రచారం చేయాలని మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మందాడి సురేందర్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ అన్నోజిగూడలో బీఆర్ఎస్ బూత్ కమిటీ సభ్యుల సమావేశం శనివారం జరిగింది. మున్సిపల్ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు బీఆర్ఎస్ మేనిఫేస్టో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి మంత్రి మల్లారెడ్డి చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాల్సిందిగా బూత్ కమిటీ సభ్యులు ప్రచారం చేయాలని సూచించారు. మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యా నాయక్, మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంటు గొంగళ్ల బాలేశ్ కురుమ, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, కౌన్సిలర్స్ సింగిరెడ్డి సాయిరెడ్డి, సుర్వి రవీందర్ గౌడ్, బి. హరిప్రసాద్ రావు, నాయకులు సుర్వి శ్రీనివాస్, మోటుపల్లి శ్రీనివాస్, అబ్బవతి నర్సింహ, బి. జగన్‌మోహన్ రెడ్డి, నర్రి కాశయ్య, ఆకిటి బాల్‌రెడ్డి, బొక్కా బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎవరు బీఆర్ఎస్‌ను వీడినా రోహిత్‌రెడ్డి గెలుపు ఖాయం

- మాజీ మర్కెట్ కమిటీ చైర్మన్ విఠల్‌నాయక్

తాండూరు, అక్టోబరు 21, ప్రభాతవార్త :

తాండూరు నియోజకవర్గంలో ఎంతమంది నాయకులు బీఆర్ఎస్ పార్టీని వీడినా ఎన్నికల్లో గెలుపు మాత్రం రోహిత్‌రెడ్డిదే అని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విఠల్‌నాయక్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన పథకాలన్ని బోగస్ అని.. బీఆర్ఎస్ ప్రకటించిన పథకాలే అభివృద్ధి, సంక్షేమానికి నిదర్శనమని చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ హవా కొనసాగుతుందని తెలిపారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. పార్టీలు మారినా మ్చుటగా మూడో సారి కేసీఆర్ సీఎం అవ్వడం ఖాయమని... తాండూరులో రెండో సారి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కౌరవులందరు ఏకమైనా పాండవులే గెలిచారని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ హవా కొనసాగుతుందని ప్రజలను మభ్యపెట్టాని చూస్తున్నారని విమర్శించారు. ఎవరెన్ని ఎత్తులు వేసిన సీఎం కేసీఆర్ చేస్తున్న సంక్షమాన్ని, అభివృద్ధిని చూసే ప్రజలు ఓటు వేస్తారని తెలిపారు. తాండూరులో ఎంతమంది పార్టీ మారినా రోహిత్‌రెడ్డికి ఎలాంటి నష్టం లేదని, రోహిత్‌రెడ్డి ప్రజల మనిషని.. ఆయనను తాండూరు ప్రజలు గెలిపించుకుంటారని విఠల్‌నాయక్ అన్నారు.

గడప గడపకు కాంగ్రెస్

-ఇంటింటి ప్రచారం చేపట్టిన కాంగ్రెస్ అభ్యర్థి రామ్మోహన్ రెడ్డి

చౌడాపూర్ అక్టోబర్21,ప్రభాతవార్త :

పరిగి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి,డిసిసి అధ్యక్షుడు టి. రామ్మోహన్ రెడ్డి మండల పరిధిలోని పలు గ్రామాలలో గడ పగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొని ఆరు గ్యారంటీల పథకాలను ప్రజలకు వివరించారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ కుమార్ ఆధ్వర్యంలో,కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రామ్మోహన్ రెడ్డి సమక్షంలో పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.చౌడపూర్,మందిపాల్,వీరాపూర్,విఠలాపూర్ గ్రామాలలో కాంగ్రెస్ కార్యకర్తలు,నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గ్యారంటీ అభివృద్ధి సంక్షేమ పథకాలను అందిస్తామని తెలిపారు.కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతినెల ఆసరా పింఛన్ ,500లకే గ్యాస్ సిలిండర్,ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం,రైతు భరోసా ద్వారా రైతులకు ,కౌలు రైతులకు ఎకరానికి రూ.15 వేలు,వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు వరి పంటకు 500 బోనస్,గృహ జ్యోతి,ఇందిరమ్మ ఇల్లు,యువ వికాసం,విద్యార్థులకు చేయూత వంటి అనేక రకాల సంక్షేమ అభివృద్ధి ఫలాలు ప్రతి పేదవాడికి అందుతాయని ,కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని రామ్మోహన్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు...ఈకార్యక్రమంలో నాయకులు భీమ్ రెడ్డి,నరసింహ నాయక్,దామోదర్ రెడ్డి,శివరాం నాయక్,గోపాల్ నాయక్,సలీం,ఉమాపతి రెడ్డి,శశిధర్ రెడ్డి,చాకల్ పల్లి సర్పంచ్ రాములమ్మ,శేఖర్,రాము,పార్టీ కార్యకర్తలు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయిలో ప్రతి కార్యకర్త పనిచేస్తేనే విజయం తథ్యం

- కర్ణాటక రాష్ట్ర సంఘటన మంత్రి రాజేష్

- షాద్‌నగర్‌లో బీజేపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న కర్ణాటక రాష్ట్ర సంఘటన మంత్రి రాజేష్

షాద్‌నగర్, అక్టోంబర్ 21, (ప్రభాతవార్త) :

బూత్ స్థాయిలో ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేస్తేనే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని, అందుకు అందరు కలిసిమెలిసి పనిచేయాలని కర్ణాటక రాష్ట్ర సంఘటన మంత్రి రాజేష్ అన్నారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో బీజేపీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ టంగుటూరి విజయ్‌కుమార్ అధ్యక్షతన బీజేపీ నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక రాష్ట్ర సంఘటన మంత్రి రాజేష్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, తదితర బీజేపీ నాయకులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి రాజేష్ మాట్లాడుతూ... సమిష్టిగా పనిచేసిన చోట విజయం తప్పక వరిస్తుందని, ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో విజయం సాధించినప్పుడే ఎమ్మెల్యే అభ్యర్థి విజయం సాధిస్తారని ఆయన అన్నారు. కర్ణాటకలో జరిగిన ఎన్నికల్లో కార్యకర్తలు ప్రచారానికి పరిమితం అయి ఇంటింటికి వెళ్లలేకపోవడం వల్లనే బీజేపీ విజయం సాధించలేకపోయిందని, ఇక్కడ అలా జరగడానికి విలులేదని, అందరు కలిసికట్టుగా పనిచేయాలని, ప్రజలకు డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే కలిగే ప్రయోజనాల గురించి పూర్తిగా వివరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా టీచర్ ఎమ్మెల్సీ ఎవీఎన్‌రెడ్డి మాట్లాడుతూ... ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు సార్లు ఇండిపెండెంట్‌గా పోటీచేస్తే గెలుపొందలేదని, కానీ బీజేపీ పార్టీ తరుపున పోటీ చేస్తే కార్యకర్తలు కలిసి కట్టుగా పోటీ చేసి గెలిపించారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణలో బీజేపీ కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేస్తారని వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కనర్సింహ్మారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవల్లి ఆశోక్‌గౌడ్, జిల్లా వైస్ ప్రసిడెంట్ భూపాలచారి, జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్ గుప్త, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చెంది మహేందర్‌రెడ్డి, ఏపీ మిథున్‌రెడ్డి, పాల మూరు విష్ణువర్ధన్‌రెడ్డి, పాతపల్లి కృష్ణారెడ్డి, కొప్పుల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బూత్ కమిటీల ఎన్నిక

బూత్ కమిటీల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటిసి దశరథ్‌నాయక్

కడ్తాల్,అక్టోబరు 21 ప్రభాతవార్త :

కడ్తాల్ మండల కేంద్రంలోని కర్కల్‌పహాడ్ 165 బూత్ కమిటిని గోవిందాయపల్లి 169 బూత్ కమిటి వాసుదేవ్‌పూర్ 170 బూత్ కమిటిని శనివారం ఎన్నుకున్నారు. అదేవిధంగా మండలంలోని అతిపెద్ద గ్రామ పంచాయతీ ముద్విన్‌లో 206, 207,208 బూత్ కమిటీలను మండల జడ్పీటిసి దశరథ్ నాయక్ సమక్షంలో ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జడ్పీటిసి మాట్లాడుతూ బూత్ కమిటీలో పదిమంది సభ్యులు ఉంటారని, ప్రతి ఒక్కరు పార్టీ గురించి కష్టపడి ప్రతి ఇంటితలుపు తట్టి బిఆర్ఎస్‌కు ఓటు వేయాలని అదేవిధంగా మన పార్టీ చేస్తున్నటువంటి అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేయాలని బూత్ కమిటి సభ్యులుగా ఎన్నికైన వారికి సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. సంక్షేమ పథకంలో భాగంగా ప్రతి ఇంటికి ప్రతి కుటుంబానికి మన సంక్షేమ పథకం అందించి మనము ఓటు అడగడానికి అన్ని విధాలుగా అర్హులమని మాట్లాడడం జరిగింది. ప్రతి కార్యకర్త ఒకరిని ఒకరు సమన్వయం చేసుకుని రాబోయే ఎన్నికలలో మన పార్టీ అభ్యర్థి జైపాల్ యాదవ్‌ని అధిక మెజార్టీతో గెలిపించి మంత్రిగా చూసేవరకు మనమందరం కలిసికట్టుగా ఐకమత్యంగా ముందుకు సాగాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కంబాల పరమేష్, ఆమనగల్లు, కడ్తాల్ ఉమ్మడి మండలాల పిఏసిఎస్ ఛైర్మన్ గంప వెంక టేష్‌గుప్తా, వైస్ ఎంపిపి ఆనంద్, కర్కల్‌పహాడ్ ఎంపిటిసి లచ్చిరామ్‌నాయక్, మండల రైతు కో ఆర్డినేటర్ జోగు వీరయ్య, కడ్తాల్ సర్పంచ్ గూడూరు లక్ష్మి నరసింహారెడ్డి, కడ్తాల్ టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గంప శ్రీనివాస్‌గుప్తా, గోవిందపల్లి ఉపసర్పంచ్ ఎల్లాగౌడ్, నాయకులు అంజినాయక్, సిహెచ్ మహేష్, బూత్ కమిటి సభ్యులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌ల, గ్రామ అధ్యక్షులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాగుతున్న దేవినవరాత్రి ఉత్సవాలు

అమ్మవారికి పూజలు చేస్తున్న దుర్గా భవాని ఉత్సవ కమిటీ సభ్యులు

ఆమనగల్లు, అక్టోబర్21, ప్రభాతవార్త:

ఆమనగల్లు మండల కేంద్రంలో దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్దలతో అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలతో మొక్కులు చెల్లించుకుంటున్నారు. శ్రీకన్యకపరమేశ్వరి ఆలయంలో దసర శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం నాటికి 6వ రోజుకు చేరుకున్నాయి. శ్రీలలితాదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అలాగే సత్యనారాయణస్వామి వ్రతం చేయగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైనారు. ఆలయ పూజారులు మంత్రోచ్ఛరణల మధ్య నవరాత్రి ప్రత్యేక పూజలు గావిస్తుండగా, చుట్టు ప్రక్కల ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణంతో విరిజిల్లుతున్నాయి. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వీరబొమ్మ రాంమోహన్‌గుప్త పర్యవేక్షణలో ఉత్సవాలు దిగ్విజయంగా సాగుతున్నాయి. మహిళలు, పురుషులు, చిన్నారులు, వృద్దులు అధిక సంఖ్యలో ఉత్సవాలకు తరలివస్తుండగా, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ ఉపాధ్యక్షుడు బికుమాండ్ల పాండయ్య, ప్రధాన కార్యదర్శి బికుమాండ్ల నర్సింహ్మాగుప్త, కోశాధికారి బికుమాండ్ల శ్రీనివాస్‌గుప్త, కొర్వి వెంకటయ్యగుప్త, కండె సత్యంగుప్త, బికుమాండ్ల కృష్ణయ్య, విడియాల ప్రసాద్, కండె వెంకట్, శ్యాంసుందర్, కర్నాటి కృష్ణయ్య, కొట్ర మల్లేశ్‌గుప్త, దొంతు సత్యం, దొంతు విశ్వనాథం, నర్సింహ్మాగుప్త తదితరులు ఉన్నారు.

శ్రీకన్యకపరమేశ్వరి ఆలయంలో 6వరోజు పూజలు చేస్తున్న భక్తులు

దుర్గా భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో....

ఆమనగల్లు పట్టణంలోని శ్రీనివాసకాలనీలో దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్దల మధ్య కన్నుల పండువగా జరుగుతున్నాయి. దుర్గా భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. నిత్యపూజలు, ప్రత్యేక కార్యక్రమాలతో అమ్మవారి నామస్మరణ మారుమ్రోగుతుంది. దుర్గాదేవిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున మండపం వద్దకు తరలివస్తున్నారు. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన మండపం అందరిని ఆకట్టుకుంటుంది. గత ఆరు సంవత్సరాలుగా ఇక్కడ దేవి నవరాత్రి ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తుండగా, ఈఏడాది కూడా అందుకు రెట్టింపు ఏర్పాట్లు చేసి ఆకట్టుకున్నారు. శనివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, లైటింగ్ వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఆకర్షణగా నిలిచాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం కొనసాగించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడిశెట్టి ప్రవీణ్, ఉత్సవ కమిటీ హిందూ శ్రీశైలం, ఉపాధ్యక్షుడు టిల్లుయాదవ్, ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, మస్న మురళీధర్, మధు, సింగం రవి, గుండ్రాతి కుమార్‌గౌడ్, సాంబ, పాతకోట శివ, అజయ్, రాకేశ్,గుజ్జరి పవన్, నిఖిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆనందోత్సవాల మధ్య సద్దుల బతుకమ్మ సంబరాలు

కొందుర్గు, అక్టోంబర్ 21, (ప్రభాతవార్త) :

సద్దుల బతుకమ్మ సంబరాలను మహిళలు ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీ ఉమమహేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ నర్సింహ్మ స్వామి ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం రంగురంగుల పూలతో ఆలంకరించిన బతుకమ్మలను మధ్యలో పెట్టి బతుకమ్మ ఆట సంబరాలను జరుపుకున్నారు. అలాగే కౌండిన్య మహిళ సంఘం, ముదిరాజ్ మహిళా సంఘం, మున్నూరు కాపు, కుర్మ, వాల్మీకి, మహిళా సంఘాల ఆధ్వర్యంలో కూడా బతుకమ్మ ఆటలను ఆడుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ పద్ధతిలో ముస్తాబు అయ్యి దండియా, కొలాటాలతో పాటు వివిధ సంస్కృతిక ఆటలను పాటలను పాడుకున్నారు. ఇంకా మండలంలోని రేగడి చిల్కమర్రి, ముట్పూర్, చిన్న ఎల్కిచర్ల, గంగన్నగూడెం, తంగళ్లపల్లి, విశ్వనాథ్‌పూర్, లాలాపేట్, టేకులపల్లి, పర్వతాపూర్, గ్రామాలల్లో చిన్న పెద్ద తారతమ్యం లేకుండా బతుకమ్మ ఆటలను ఆడుకున్నారు. రాత్రి ఆయా గ్రామాలలో చివరన గల చెరువులు, కుంటల వద్దకు వెళ్లి బతుకమ్మకు పూజలు చేసి వెళ్లి రావమ్మ బతుకమ్మ అంటూ నీటిలో వదిలేశారు.

ఘనంగా వెన్నముద్దల బతుకమ్మ పండుగ

బతుకమ్మలతో చిన్నారులు

బొంరాస్‌పేట్,అక్టోబర్21,ప్రభాతవార్త ఃి బొంరాస్‌పేట్ మండల పరిధిలోని తుంకిమెట్ల,దేవులనాయక్ తాండలో ఎనమిదవ రోజు వెన్నముద్దల బతుకమ్మ పండుగను మహిళలలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో మహిళలలు బతుకమ్మను తయారు చేసి ఒకచోటుకు చేర్చి మహిళలు,చిన్నారులు ఉత్సహంగా పాటలుపాడి ఆటలు ఆడారు. అనంతరం సమీపంలోని చేరువులలో బతుకమ్మను నిమర్జనం చేశారు. తుంకిమెట్ల గ్రామంలో ఆన్నదాన కార్యక్రమం నిర్వహించిన నిర్వహకులు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

హస్తం గూటికి చేరిన బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

కొడంగల్,అక్టోబర్ 21ప్రభాతవార్త

కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దౌల్తాబాద్,మద్దూర్ మండలాల పరిధిలోని చల్లూపూర్,గాజులకుంట తండా,దంలా తండా,పొర్లకుంట తండా,పల్లెగడ్డ తండా తదితర గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు సుమారు 100 మంది పెద్ద ఎత్తున కాంగ్రేస్ పార్టీలో చేరారు.శనివారం స్థానిక టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి స్వగృహంలో కాంగ్రేస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి సమక్షంలో వారంతా కాంగ్రేస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతు కొడంగల్ అభివృద్ది కేవలం రేవంత్‌రెడ్డితోనే సాధ్యమని,ప్రస్తుత ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అభివృద్దిని పట్టించుకోలేదని విమర్శించారు.కాంగ్రేస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారెంటీల పట్ల ప్రజలు ఆసక్తిని కనబరుస్తున్నారని పేర్కొన్నారు.

కొడంగల్ ఎన్నికల బరిలో సీపీఐ పార్టీ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కొడంగల్,అక్టోబర్ 21ప్రభాతవార్త

త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ అసెంబ్లీ స్థానంలో సీపీఐ పార్టీ బరిలో నిలువనుందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు.కొడంగల్‌లో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా అనుసరించాల్సిన విషయాలపై శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 8 మండాలల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి ఎన్నికల బరిలో నిల్చుటకై తీర్మాణం చేశారు.పార్టీ దౌల్తాబాద్ మండల బాధ్యులు మూతుల రాజు అధ్యక్షతన వహించిన సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు ఇందనూర్ బషీర్,నారాయణపేట్ జిల్లా సహాయ కార్యదర్శి చౌదాపూర్ శ్రీనివాసులు,నియోజకవర్గ కార్యదర్శి మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.సమావేశంలో వివిధ మండలాల కార్యదర్శులు శ్యాంసుందర్, కావలి లక్ష్మణ్,కురువ మల్లప్ప,కొత్తపల్లి మండల కార్యదర్శి రాజిరెడ్డి,వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి అబ్దుల్ రహీం,ఐవైఎఫ్ ముస్తాఫా,మహిళా నాయకులు చెన్నారం అనంతమ్మ,నీటూర్ సర్పంచ్ సున్నపు వెంకటప్ప,గుండప్ప,ఎర్ర రాజు,మొగులప్ప,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్న